రఘువీరారెడ్డిని కలిసిన జమీల్ అహ్మద్ బేగ్

విశాలాంధ్ర-గుంటూరు : నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ వింగ్ నేషనల్ వైస్ చైర్మన్ జమీల్ అహ్మద్ బేగ్ ఆదివారం గుంటూరు విచ్చేసిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) మెంబర్ ఎన్.రఘువీరారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. రఘువీరారెడ్డి సేవలను కొనియాడుతూ, మీ ఆధ్వర్యంలో ఇండియా కూటమి దక్షిణాదిన ఉత్తమ ఫలితాలు సాధించాలని జమీల్ అహ్మద్ బేగ్ ఆకాంక్షించారు.

సకల సౌకర్యాలతో ఎన్జీఓస్ కాలనీ ప్రారంభం

విశాలాంధ్ర-పొన్నూరు : పట్టణంలో ఎన్జీవోస్ కాలనీని ఆదివారం రాష్ట్ర చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 230 మంది కాలనీ సభ్యులకు రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీచేశారు. ఎమ్మెల్యే కిలారి రోశయ్య, రాష్ట్ర ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, జనరల్ సెక్రెటరీ కేవీ శివారెడ్డి, తాలూకా యూనిట్ పొన్నూరు అధ్యక్షుడు ఆనంద సాయిబాబు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బీసీ సమావేశానికి తరలిన కాంగ్రెస్ నాయకులు

విశాలాంధ్ర-పొన్నూరు : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆధ్వర్యంలో బీసీ సమావేశం జరగనుంది. రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జక్కా శ్రీనివాస్ నేతృత్వంలో పొన్నూరు పట్టణం నుంచి 100 మంది కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో బస్సు ఏర్పాటు చేసి జెండా ఊపి ప్రారంభించారు. కాంగ్రెస్ నేత రఘువీరారెడ్డి, బీసీ నాయకులు అజయ్ సింగ్ యాదవ్ పాల్గొంటారని జక్కా తెలిపారు.

వైసీపీ ప్రభుత్వంలో కొత్త ఉద్యోగాలు లేవు

విశాలాంధ్ర-తాడేపల్లి : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కరికి కూడా ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వలేదని ఎన్టీఆర్ అభిమాన సేవా సంఘం జాతీయ అధ్యక్షులు పాలెపు రామారావు, అక్కినేని సుబ్రమణ్యం విమర్శించారు. ఆదివారం పెనుమాకలో వారు ఓ ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి రాకముందు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు స్థానికులకు మూడు వంతులు, బయట వారికి ఒక వంతు ఉద్యోగ హామీనిచ్చి నేడు మడం తిప్పారని ఎద్దేవా చేశారు. అమరరాజా వంటి పరిశ్రమలకు పొరుగు రాష్ట్రానికి పోయి రాష్ట్రంలో వారికి ఉద్యోగాలు కల్పించలేకపోయారని, రాష్ట్రంలో చదువుతున్న అనేక వేల మంది ఇతర రాష్ట్రాలకు వెళ్లి ఉద్యోగాలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. దీనివల్ల ప్రతినెలా రాష్ట్రానికి సుమారు రూ.400 కోట్ల నష్టం జరుగుతోందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

జ్యోతిరావ్ పూలే ఆదర్శనీయులు

విశాలాంధ్ర-పొన్నూరు : ఆనాటి సమాజంలో రుగ్మతలను రూపుమాపి ప్రధానంగా స్త్రీ విద్యను ప్రోత్సహించి సంస్కరణ ఉద్యమం చేపట్టిన మహాత్మా జ్యోతిరావ్ పూలే నేటి సమాజానికి ఆదర్శనీయుడని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. పొన్నూరు పట్టణంలో పూలే విగ్రహావిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి, జంగా కృష్ణమూర్తి, మహాత్మా పూలే ఆదర్శాలను సభలో కొనియాడారు. పూలే బాటలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి సామాజిక సంక్షేమ పాలన అందిస్తున్నారని అన్నారు.

'మాటా' సభకు శాంతమూర్తి

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మన ఆంధ్ర తెలుగు అసోసియేషన్(మాటా) న్యూజిలాండ్ ఆధ్వర్యంలో న్యూజిలాండ్‌లోని ఆక్‌లాండ్‌లో నిర్వహించిన సభలకు గుంటూరుకు చెందిన వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం, అవర్ స్టేట్ అవర్ లీడర్ వ్యవస్థాపకులు జి.శాంతమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ముఖ్యకారకుడు పొట్టి శ్రీరాములు అని, ఆయన ప్రాణత్యాగం ఫలితమే ఆంధ్ర రాష్ట్ర అవతరణ అని గుర్తుచేశారు. అనంతరం న్యూజిలాండ్ పార్లమెంట్ సభ్యులు గ్లాసెస్ మెలిస్సా లీ అన్న, హెలెన్ వైట్‌లను శాంతమూర్తి కలిశారు. ఆంధ్ర ప్రజల అతిథ్యం గురించి వారికి తెలియజేశారు. మాటా సభకు దాదాపు 1000 మందికిపైగా హాజరయ్యారని తెలియజేశారు.

బంధువులు కనిపించడం లేదంటూ ఫిర్యాదు

విశాలాంధ్ర-పొన్నూరు : పట్టణంలోని 19వ వార్డు వివర్స్ కాలనీకి చెందిన కొల అర్జునరావు, కొల దుర్గ, కంకట ధరణి, కంకటవసంతి, సిద్దిరెడ్డి పావని కుటుంబకలహాల నేపథ్యంలో ఈ నెల 23వ తేదీన వివర్స్ కాలనీలో ఇంటి వద్ద నుంచి కనిపించకుండా వెళ్లిపోయారు. చుట్టు ప్రక్కల వెతికిన ఫలితం లేకపోవడంతో బంధువు పాలపర్తి శివలీల శనివారం పొన్నూరు అర్బన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై రామబ్రహ్మం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర, తెనాలి : తెనాలి బస్టాండ్ నందు భోజన విరామ సమయంలో ఆర్‌టిసి డ్రైవర్లు కావలి వద్ద ఆటోనగర్ డిపో డ్రైవర్ రామ్‌సింగ్‌పై జరిగిన దాడి నిరసన తెలియజేస్తూ గేటు మీటింగ్ నిర్వహించారు. డ్రైవర్‌పై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉదయం మొదటి సర్వీస్ నుండి డిపోలో అన్ని ఉద్యోగ సంఘాలు కలిసి ఉద్యోగులకు నల్ల బ్యాడ్జిలు ధరింపజేసి తమ నిరసన తెలిపారు. ఆర్‌టిసి ఉద్యోగిపై దాడి ఘటన ఖండిస్తూ దోషులకు శిక్ష పడే వరకు నిరసన కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఇ.విజయకుమార్, రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.రాజేష్‌ఖన్నా, డిపో అధ్యక్ష కార్యదర్శులు కె.బాబు, ఎన్.సుధాకర్, యల్లమంద, వీరయ్యబాబు, రవీంద్రరెడ్డి, మహిళా ఉద్యోగులు పోలేరమ్మ, ప్రసన్నజ్యోతి, శివపార్వతి, రమాజయశ్రీ, భూలక్ష్మి, పెద్ద ఎత్తున పాల్గొని నిరసనలు తెలియజేశారు.

పంట పొలాలకు సాగునీరు ఇవ్వాలి

విశాలాంధ్ర-పొన్నూరు : మండలంలో వరి సాగుకు నీరు ఇవ్వాలని తెదేపా మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. శనివారం మండలంలోని పెద్దపాలెం, కెబి పాలెం గ్రామాలలోని వరి పంట పొలాల ఆ పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.

జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

కలెక్టర్‌ను కోరిన అప్పిరెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లాలో అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డిని ప్రభుత్వ విప్, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ లబ్ధి చేకూరేలా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. శాసనమండలిలో ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా కలెక్టర్‌ను ఆదివారం కలెక్టర్ బంగ్లాలో అప్పిరెడ్డి మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా జరిగిన భేటీలో జిల్లాలో జరుగుతున్న అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై వారిరువురూ సమగ్రంగా చర్చించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆలోచనలు, ఆశయాల మేరకు జిల్లా అంతటా విస్తృతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని, వాటిని సకాలంలో పూర్తి చేసినప్పుడే ప్రజలకు ప్రగతి ఫలాలు సవ్యంగా అందుతాయని అప్పిరెడ్డి అభిప్రాయపడ్డారు. సీఎం జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యానికి ఇస్తున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని జిల్లా అధికార యంత్రాంగం అందరికీ ఉచితంగా ఉత్తమ, ఉన్నత విద్య, అధునాతన వైద్యం అందేలా చూడాలన్నారు.

పక్షవాతం నివారణపై అవగాహనా ర్యాలీ

ప్రారంభించిన డాక్టర్ విజయ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : సంవత్సరానికి 10 కోట్ల మంది పక్షవాతం బారినపడుతున్నారని, అయితే వీటిల్లో 90శాతం నివారించదగినవేనని ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ పమిడి ముక్కల విజయ అన్నారు. పక్షవాతం నివారణకు అవగాహన ముఖ్యమని, దీనిని నియంత్రించకపోతే 2050 నాటికి వ్యాధి బారినపడే వారి సంఖ్య రెట్టింపు అయ్యే ప్రమాదం ఉందని పలు నివేదికలు చెబుతున్నట్లు వివరించారు. ప్రపంచ పక్షవాత దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ గుంటూరు ఆధ్వర్యంలో గుంటూరులోని ప్రముఖ న్యూరాలజిస్ట్‌లందరూ 'పక్షవాతం'పై అవగాహన కల్పించేందుకు స్థానిక బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడిఎం నుంచి గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్ వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డాక్టర్ విజయ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పక్షవాత లక్షణాలు..నివారణ..పక్షవాతానికి గల కారణాలు గురించి ప్లకార్డులు.. బ్యానర్లతో.. పాంప్లెట్స్‌తో ప్రజలకు అవగాహన కల్పించారు. లలితా కాలేజీ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు 'పెరాలిసిస్'అనే అంశంపై స్కిట్ చేసి అందరినీ అబ్బురపరిచారు. అనంతరం గుంటూరు న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రామ తారకనాథ్ స్ట్రోక్ నివారణకు జీవనశైలిలో మార్పుల ప్రాధాన్యతను వివరించారు. అలాగే అసోసియేషన్ కోశాధికారి డాక్టర్ సీహెచ్.శివరామ కృష్ణ బ్రెయిన్ హెల్తీ డైట్ గురించి తెలియజేశారు. జీజీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ కుమారి రెగ్యులర్ వ్యాయామాల వల్ల జరిగే ప్రయోజనాలను విశదీకరించారు. అలాగే శనివారం సాయంత్రం ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ సహకారంతో స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన మందిరంలో 'స్ట్రోక్'పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ ర్యాలీలో డాక్టర్ జి.చందన, డాక్టర్ ఎస్.కళ్యాణ చక్రవర్తి, డాక్టర్ పి.రాజేంద్ర కుమార్, డాక్టర్ ఎం.భార్గవి, డాక్టర్ పిడికిటి బాలకృష్ణ, డాక్టర్ ఆర్.బాలకృష్ణ నాయక్, డాక్టర్ ఘంటా శ్రీనివాస్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ రత్నాకర్, జీజీహెచ్ న్యూరాలజీ విద్యార్థులు, లలితా హాస్పిటల్ స్ట్రోక్ వలంటీర్స్ డాక్టర్ మధు, హెచ్ఆర్ అభిషేక్. షాహిద్, రామచారి, అరుణ్‌కుమార్, రాఘవేంద్ర, ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్, పారా మెడికల్ సిబ్బంది, లలితా కాలేజీ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు, లాఫింగ్ క్లబ్స్ సభ్యులు పాల్గొన్నారు.

దేశ సమగ్రతకు 'నామట్టి-నాదేశం' దోహదం

విశాలాంధ్ర-గుంటూరు : ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు మేరా మాటీ-మేరా దేశ్ (నామట్టి-నాదేశం) కార్యక్రమంలో భాగంగా ఈ నెల 31వ తేదీన ఢిల్లీలో కర్తవ్యపద్‌లో నిర్వహించే అమృత్ కలశ యాత్రకు గుంటూరు జిల్లా నుంచి 65 మంది నాయకులు, మహిళలు పార్లమెంటు పరిధిలోని అన్ని మండలాల్లో సేకరించిన మట్టిని అమృత కలశాల్లో నింపి వాటిని తీసుకొని విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర మాట్లాడుతూ నా మట్టి-నా దేశం కార్యక్రమం మన ఐక్యత సమగ్రతలను బలోపేతం చేస్తుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పదకొండు వేల గ్రామ పంచాయతీల నుంచి సేకరించిన మట్టిని ప్రత్యేక కలశాల్లో ఢిల్లీకి పంపుతున్నట్లు తెలిపారు. ఈ నెల 31 మధ్యాహ్నం ఢిల్లీలో కొత్తగా నిర్మించనున్న అమృతవనానికి ఈ కలశాలను చేర్చనున్నారని తెలిపారు. దేశం కోసం అసువులు బాసిన వీరసైనికుల పేరు మీద అమృతవనంలో ఒక మొక్కను నాటి ఆ మొక్క పెరగటానికి ఈ మట్టిని వినియోగించటం జరుగుతుందని తెలియచేశారు. ఈదర శ్రీనివాసరెడ్డి, పాలపాటి రవికుమార్, రాచుమల్లు భాస్కర్, కొక్కెర శ్రీనివాస్, వెలగలేటి గంగాధర్, దారా అంబేద్కర్, ఈమని మాధవరెడ్డి, తోట శ్రీనివాస్, జితేంద్రగుప్త, సుధాకర్, కలపాల శ్రీనివాస్, కత్తి సరోజినీ, ఏలూరి లక్ష్మి, లాలా స్వాతి తదితరులు ఢిల్లీ వెళ్ళినవారిలో ఉన్నారు.

పీఆర్సీచర్చకు ఉద్యోగ సంఘాలను ఆహ్వానించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్సీ-2023 (వేతన సవరణ సంఘం) నుంచి అమలు చేసేందుకు ప్రభుత్వం ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చలు జరపాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఎ)గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం గుంటూరు మెడికల్ కాలేజీ ఆవరణలో ఉన్న ఏపీ జీఈఎ జిల్లా కార్యాలయం నందు మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చాంద్‌బాషా మాట్లాడుతూ పీఆర్సీ-2023 అమలు చేయని పక్షంలో ఐఆర్ (ఇంటీరియర్ రిలీఫ్) ఇచ్చే విధంగా ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశం ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్యామ్ హుస్సేన్‌ఖాన్, సంయుక్త కార్యదర్శి జి.శ్రీనివాసరావు, నగరశాఖ అధ్యక్షులు వై.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డాన్సర్ల అభ్యున్నతికి కృషి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: డాన్సర్ల అభివృద్ధి, అభ్యున్నతికి తోడ్పడే విధంగా ఏపీ డాన్సర్స్ అండ్ డాన్స్ డైరెక్టర్ అసోసియేషన్ కృషి చేస్తుందని అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.లోకేష్ తెలిపారు. ఆదివారం స్థానిక ఒక పాఠశాలలో ఏపీ డాన్సర్స్ అండ్ డాన్స్ డైరెక్టర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎస్.లోకేష్, ఉపాధ్యక్షులుగా డి.రాజగోపాల్, సెక్రటరీగా పి.మల్లి, జాయింట్ సెక్రటరీగా ఎస్.సన్నీ, ట్రెజరర్‌గా పి.రాంబాబు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా జి ప్రశాంత్, కే అఖిల్, జి పవన్, షేక్ జానీ ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులు లోకేష్ మాట్లాడుతూ నూతన కార్యవర్గం రానున్న రోజుల్లో డాన్సర్ల సమస్యల పరిష్కారానికి, వారి అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. కరోనా వంటి విపత్కర పరిస్థితిలో డాన్సర్‌ల సమస్యలను గుర్తించి వారికి ఆర్థికంగా తోడ్పాటును అందిస్తూ వారిలో మనో ధైర్యాన్ని నింపేందుకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. డాన్సర్లకు హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ పాలసీలు ఇవ్వటం జరిగిందని వారి కుటుంబాలకు ఏమైనా సమస్యలు వస్తే ఆదుకుంటామని తెలిపారు. నూతన డాన్సర్లను ప్రోత్సహించేందుకు డాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్న కళాకారులను ఆదుకునేందుకు తమ అసోసియేషన్ శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గాన్ని సభ్యులు ఘనంగా సత్కరించారు.

ఉచిత అన్నమయ్య సంకీర్తన శిక్షణ

విశాలాంధ్ర, తెనాలి : బోస్‌రోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో ఆదివారం ఉచిత అన్నమయ్య సంకీర్తన శిక్షణ తరగతులు కొండపి వసుంధర ఆధ్వర్యంలో జరిగినవి. చిన్నారులు తన్మయి, సాయి అజిత్, వినతి, లలిత కుమారి, వాసవి, అన్నపూర్ణ, కనకదుర్గ, పెద్దలు మొత్తం 35 మంది సభ్యులు అన్నమయ్య కీర్తనలు నేర్చుకుంటున్నారు. ఈ కార్యక్రమం కేవలం అన్నమయ్య సంకీర్తన ప్రచార నిమిత్తం చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో ఆసక్తి కలిగిన వారు పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కొండపి శ్రీనివాసరావు, అందెబాలచంద్రమౌళి, సూరాబత్తుని కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతతోనే గుండె జబ్బులు దూరం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మానసిక ప్రశాంతత లేమి వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉన్నందున మనం మన మనస్సును మానసికంగా.. ఆరోగ్యంగా ఉంచుకోవాలని గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ బి.నాగరాజు పేర్కొన్నారు. పెద్ద వయస్సులో వచ్చే గుండె జబ్బులు కొన్ని సందర్భాలలో వారి మానసిక అనారోగ్యం వల్ల కూడా సంభవించే అవకాశం ఉంటుందన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'హృదయ సంబంధ వ్యాధులు గురించి అవగాహన' ఆరోగ్య సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ గుండె జబ్బులకు షుగర్, రక్తపోటు, ధూమపానం, వంశ పారంపర్యం, జన్యుపరమైన కారణాలుగా కనపడుతున్నాయని తెలిపారు. గుండె కొట్టుకునే వేగం తగ్గినా, పెరిగినా మన గుండె దగ్గర చర్మం కింద పేజ్ మేయర్స్ అమరుస్తారని, అది గుండె సాధారణ స్థితిలో కొట్టుకునేలా చేస్తుందని చెప్పారు. కోపాన్ని ఎక్కువగా ప్రదర్శించే వారందరికీ రక్తపోటు ఉంటుందని, లావుగా ఉన్న వారికే కొలెస్ట్రాల్ సమస్య ఉందని భావించొద్దన్నారు. నిర్మలంగా కనిపించే వారిలో కూడా రక్తపోటు సమస్య ఉండొచ్చని, సన్నగా ఉన్న వారిలో కూడా కొలెస్ట్రాల్ సమస్య ఉంటుందని పేర్కొన్నారు. మనం తీసుకునే ఆహారంలో పీచు పదార్థం ఎక్కువగా ఉండేలా చూసుకోవాలని, అలా చేస్తే రక్తంలో చక్కెర శాతాన్ని అదుపులో ఉంచుకోవచ్చని అన్నారు. గుండెకు సంబంధించిన రక్తనాళాలలో పూడికలు శాతం ఎక్కువగా ఉంటే స్టంట్, బైపాస్ సర్జరీ చేస్తారని, తక్కువగా ఉంటే మందులతో చికిత్స చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, చంద్రయ్య, టి.నారపరెడ్డి, సీహెచ్ అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఓటమి భయంతోనే చంద్రబాబు అరెస్టు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల్లో ఉంటే తమ గెలుపు సాధ్యం కాదన్న భయంతోనే ఆయనను అక్రమంగా అరెస్టు చేయించి జైలులో వేశారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర అన్నారు. ఆదివారం స్థానిక అమరావతి రోడ్డు బండ్లమూడి గార్డెన్స్ వద్ద కార్పొరేటన్ కొమ్మినేని కోటేశ్వరరావు , డివిజన్ అధ్యక్షులు జమ్ముల వీరాంజనేయులు నేతృత్వంలో కరపత్రాల పంపిణీ, బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కి గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నెల్లూరి సాయి కృష్ణ ప్రసాద్, మట్టిపూడి శివన్నారాయణ, గుంటుపల్లి శివ రామకృష్ణ ప్రసాద్, బ్రహ్మం, ముల్పూరి పేరయ్య, ఘట్టమనేని నరసింహ రావు, అబ్బూరి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఓటర్ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: పశ్చిమ నియోజకవర్గ పరిధిలో కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర, నగర పార్టీ అధ్యక్షులు డేగల ప్రభాకర్‌తో కలసి ఆదివారం స్థానిక పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నతూ ఓటర్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయించే యువత ఓటరును ఆయుధంగా వాడుకోవాలని సూచించారు. యువత ఉన్నత చదువులు చదివి ఉపాధి కోసం నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయారని, టీడీపీ అధికారంలో ఉంటేనే రాష్ట్రంలోని యువతకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరెంటి వర ప్రసాద్, పోపూరి నరేంద్ర, బెల్లంకొండ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధకులకు సన్మానం

విశాలాంధ్ర, తెనాలి : తెనాలిలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వారు ఆదివారం ఎయస్ఎన్ డిగ్రీ కాలేజ్‌లో వివిధ రంగాలలో ఎనలేని సేవలు అందిస్తున్న 5గురు మహిళా మూర్తులకు సన్మాన కార్యక్రమం జరిగింది. కాలేజ్ ఛైర్మన్ కొలసాని రాంచంద్ అధ్యక్షత వహించారు. సామాజిక రంగంలో డా.శారద, సంఘ సేవలో ఎ.రాజేశ్వరి, రిటైర్డ్ ప్రిన్సిపల్ క్లాసికల్ నృత్యంలో వెంకటలక్ష్మి, బాలత్రిపుర సుందరి, వృద్ధులకు సేవ చేసినందుకు కూరపాటి కళ్యాణిలను ఘనంగా సన్మానించారు. మానవత రీజనల్ ఛైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మానవత వినూత్నంగా చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. 5గురు మహిళా మూర్తులకు మా సంస్థ ద్వారా సన్మానం చేయడం ఆనందదాయకం అన్నారు. కార్యక్రమంలో తన్నీరు శ్రీనివాసబాబు, పి.వెంకట్, ఓంకార్ ప్రసాద్, సత్యనారాయణ, శ్రాఘవరెడ్డి, దినేష్ కుమార్, మానవత సభ్యులు పాల్గొన్నారు.

ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌కు జాతీయ స్థాయి అవార్డు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : 'వాయిస్ ఆఫ్ హెల్త్ కేర్'అనే జాతీయ స్థాయి సంస్థ వరల్డ్ స్ట్రోక్ దినోత్సవం-2023ను పురస్కరించుకుని గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో ఈ నెల 27న నిర్వహించిన నేషనల్ స్ట్రోక్ కాన్ క్లేవ్-2023 నందు 'బెస్ట్ స్ట్రోక్ అవేర్‌నెస్ అడ్వకేట్ హాస్పిటల్ ఆఫ్ ది ఇయర్' జాతీయ స్థాయి అవార్డును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌కు వరించింది. గుజరాత్ రాష్ట్ర ఆరోగ్య, సంక్షేమ శాఖామంత్రి ఋషికేష్ గణేష్ భాయ్ పటేల్ చేతుల మీదుగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చీఫ్ న్యూరాలజిస్ట్, మేజర్ జనరల్ రిటైర్డ్ డాక్టర్ కుమారవేలు ఈ అవార్డును అందుకున్నారు. ప్రపంచ స్థాయి నాణ్యతా ప్రమాణాల సంస్థ 'జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్ (జేసీఐ)అత్యుత్తమమైన వైద్య సేవలు అందించే హాస్పిటల్స్‌కు ఇచ్చే గుర్తింపును గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌కు ఈ అవార్డు రావడం ఇది రెండవసారి. అదేవిధంగా భారతదేశంలోని ఎంతో ప్రతిష్టాత్మకమైన 'క్వాలిటీ అండ్ అక్రిడిటేషన్ ఇన్‌స్టిట్యూట్' దేశం మొత్తం మీద స్ట్రోక్ పేషంట్లకు నాణ్యమైన వైద్య సేవలు అందించే 6 స్ట్రోక్ సెంటర్లకు గుర్తింపు నివ్వగా ఆంధ్ర రాష్ట్రంలో పూర్తి స్థాయి స్ట్రోక్ సెంటర్‌ను నిర్వహిస్తున్న గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్ అక్రిడిటేషన్ ఇచ్చింది. ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం సందర్భంగా ఆదివారం రమేష్ హాస్పిటల్ నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చీఫ్ న్యూరాలజిస్ట్ డాక్టర్ కుమారవేలు మాట్లాడుతూ స్ట్రోక్ వచ్చినన మొదటి గంటలో వ్యాధి నిర్ధారణ, వైద్య చికిత్స ఎంతో అవసరమని, తద్వారా ప్రాణహాని..దీర్ఘకాలిక అంగవైకల్యం నుంచి పేషంట్‌ను కాపాడగలమన్నారు. స్ట్రోక్ కారకాలుగా పరిగణించే రక్తపోటు, షుగర్ వ్యాధులను అదుపులో ఉంచుకోవాల్సిన అవసరాన్ని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సామాజిక బాధ్యతగా గుర్తించి పక్షవాతం వల్ల సంభవించే దుష్ఫలితాలను..సమాజంలోని పౌరులకు నిరంతరం అవగాహన కల్పించడం..పక్షవాత నివారణ కోసం నడక అనే కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలలో అవగాహన కలిగించడానికి గుంటూరు, పరిసర ప్రాంతాల్లో ఎంతో కృషి చేసినందుకు జాతీయ స్థాయిలో బ్రెస్ట్ స్ట్రోక్ అవేర్‌నెస్ అడ్వకేట్ హాస్పిటల్ ఆఫ్ ది ఇయర్ అవార్డును పొందినట్లు చెప్పారు. ఈ సమావేశంలో రమేష్ హాస్పిటల్ న్యూరాలజిస్టులు డాక్టర్ ఎస్.బాలకృష్ణ, డాక్టర్ పి.హరిణి, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి శ్రీనివాసరావు, బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ డాక్టర్ వై.కార్తీక్ చౌదరి పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

స్వచ్ఛమైన ఓటర్ల రూపకల్పనకు కృషి చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఈ నెల 27వ తేదీన ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాను అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు పరిశీలించి ఓట్ల అక్రమాలను నివారించి స్వచ్ఛమైన ఓటర్ల రూపకల్పనకు కృషి చేయాలని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18ఏళ్ళు నిండిన ఎవరైనా ఓటుహక్కు కోసం డిసెంబరు 9 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ సదవకాశాన్ని యువత వినియోగించుకోవాలని కోరారు. ఈ ఏడాది 15.84 లక్షల ఓట్లను కొత్తగా చేర్చుకోవడం..13.48 లక్షల ఓట్లు తొలగించడం ద్వారా ఓటర్ల సంఖ్య అదనంగా 2.36 లక్షల మంది అదనంగా పెరిగినట్లు తెలిపారు. ఫాం-7 అక్రమంగా దాఖలు చేయడం వలన లక్షలాది ఓట్లు కోల్పోయామని అనేక ఆరోపణలు వెల్లువెత్తిన సందర్భంగా పర్చూరు, ఉరవకొండ నియోజకవర్గాలలో ఉన్నత అధికారులను సస్పెండ్ చేశారని, ఈ నేపథ్యంలో ఏ అధికారి కూడా అక్రమాలకు పాల్పడవద్దని హితవుపలికారు. నవంబర్ 4, 5 తేదీలలో, డిసెంబరు 2, 3 తేదీలలో బూత్ లెవల్ అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారని, ఎన్నికల విధులలో వలంటీర్లను, సచివాలయ సిబ్బందిని వినియోగించుకోకుండా అనుభవం ఉన్న ఉపాధ్యాయులను, అధ్యాపకులను, గెజిటెడ్ ఆఫీసర్లను వినియోగించాలని లక్ష్మణరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యుల నియామకానికి సంబంధించి ఈ నెల 21వ తేదీన విడుదల చేసిన జీఓ-47లో జరిగిన అవకతవకలు..అవినీతిపై విచారణ కమిటీని నియమించి నిజానిజాలు నిగ్గు తేల్చి సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వక్ఫ్ చట్టానికి విరుద్ధంగా జీఓను విడుదల చేస్తున్నారని నేను పలుమార్లు మైనార్టీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎండీ. ఇంతియాజ్‌కు, వక్ఫ్‌బోర్డు సీఈఓ ఎల్.అబ్దుల్ ఖాదిర్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా విశాఖపట్నానికి చెందిన మర్రిపాలెం మసీదు ఆక్రమణదారుడు అయిన హాజీ బరకత్ అలిని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యునిగా నియమిస్తున్నట్లు వస్తున్న ఊహాగానాలు వస్తున్న నేపథ్యంలో ఒక ఆక్రమణదారుడిని వక్ఫ్‌బోర్డు సభ్యునిగా నియమించడం వక్ఫ్ చట్టానికి విరుద్ధమని ఒక న్యాయవాదిగా లీగల్ నోటీసులు ఇచ్చినా కూడా ఈ నెల 21వ తేదీన జీఓ విడుదల చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. వైసీపీ పార్టీలో పదవులు రావాలంటే అవినీతి, ఆక్రమణదారులు, మర్డర్లు చేసిన వారు, రౌడీ షీటర్లు గానీ అయి ఉండాలా? అని సీఎం వైఎస్ జగన్‌ను ప్రశ్నించారు.

సాహిత్య విదూషిమణి 'డాక్టర్ చిల్లర భవానీ దేవి'

విశాలాంధ్ర-గుంటూరు : విద్యార్థి దశ నుంచే కుటుంబ, ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ ఐదు దశాబ్దాలుగా రచయిత్రిగా, కథకురాలిగా, మానవీయ కోణంలో అక్షర యజ్ఞం చేస్తున్న సాహితీ విదూషిమణి డాక్టర్ చిల్లర భవానీదేవి అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. ఆదివారం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అన్నమయ్య గ్రంథాలయంలో ప్రముఖ రచయిత్రి, సాహితీ భారతి డాక్టర్ చిల్లర భవానీదేవి సాహితీ స్వర్ణోత్సవ ప్రచురణలు 'చివరి వలస' కథా సంపుటి, 'మరోచరిత' నవల ఆవిష్కరణల సభ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ శివ శంకర్ మాట్లాడుతూ డాక్టర్ భవానీదేవి రచనల్లో వైవిధ్యంతో కూడిన మేధో వికాసం ప్రస్ఫుటమవుతుందని అన్నారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య పుస్తకాలను ఆవిష్కరణ చేశారు. సభకు సరస్వత కళానిధి డాక్టర్ వెలుఓలు నాగరాజ్యలక్ష్మి అధ్యక్షత వహించగా కీర్తిశేషులు కోటంరాజు సత్యనారాయణ శర్మ దంపతుల స్మారక సాహితీ పురస్కారం వారణాసి సూర్యకుమారికి అందజేశారు. ప్రముఖ రచయిత్రులు గోటేటి లలితా శేఖర్ చివరివలస, కుందుర్తి పద్మజ మరోచరిత పుస్తకాలను పరిచయం చేశారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభాని, కోశాధికారి నానా, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, అమరావతి సాహితీ మిత్రులు అధ్యక్షులు రావి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

విశాలాంధ్ర-గుంటూరు : విధులలో ఉన్న డ్రైవర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆర్టీసీ యూనియన్ జేఏసీ నాయ కులు డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం కావలి వద్ద విధులలో ఉన్న డ్రైవర్‌పై దుండగులు దాడికి పాల్పడిన సంఘటనను ఖండిస్తూ అన్ని యూనియన్‌లు జేఏసీగా ఏర్పడి గుంటూరు-1 డిపోలో ఆదివారం గేట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఉద్యోగ సంఘాల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధులలో ఉన్న ఆర్టీసి సిబ్బందిపై దాడులకు పాల్పడటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి దాడులు ఎట్టి పరిస్థితుల్లో పునరావృతం కాకుండా పోలీసు శాఖ, పీటీడీ యాజమాన్యం గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వీ కృష్ణారావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా సెక్రటరీ రవి శంకర్, ఎన్ఎంయూ గ్యారేజ్ ప్రెసిడెంట్ సురేష్, వైఎస్సార్ సెక్రటరీ కేఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో రోగాల నుంచి విముక్తి

విశాలాంధ్ర, తెనాలి : గత 40 రోజులుగా రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో జరుగుతున్న యోగా శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. క్లబ్ అధ్యక్షులు పావులూరి రాంబాబు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్‌పర్సన్ కందిమల్ల స్వప్న మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా సాధన వల్ల రోగాల నుండి విముక్తి పొందవచ్చని చెప్పారు. బిపి, షుగర్ వంటి దీర్ఘకాలిక రోగాలను యోగా సాధన ద్వారా మంచి ఫలితం పొందవచ్చని వివరించారు. రోటరీ క్లబ్ వారు మంచి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఆరోగ్యంగా జీవించాలంటే ఆనందంగా ఉండాలని, ఆరోగ్యాన్ని ఆనందాన్ని పొందాలంటే ప్రతిరోజూ యోగా సాధన చేయాలని చెప్పారు. కార్యక్ర మంలో యోగా గురువులు నాగం వెంకటేశ్వరరావు, శ్రీరామమూర్తి, విశాలాక్షి లను ఘనంగా సత్కరించారు. యోగా శిక్షణలో పాల్గొని ప్రతిభ కనబరిచిన గుత్తా వెంకటరత్నం, జ్యోతి, అనిత, రమేష్‌లకు రాజు కొటారి వెండి నాణాలను బహూకరించారు. కార్యక్రమంలో నాగభూషణం, నారాయణ, స్వరాజ్, ప్రవీణ్, కిరణ్, సరేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

రేపు సీఆర్ స్మారక స్థూపం ఆవిష్కరణ

విశాలాంధ్ర-చిలకలూరిపేట : తాడిత పీడిత ప్రజల కోసం, వారి అభ్యున్నతే లక్ష్యంగా జీవితపు చరమాంకం వరకు పోరాడిన మహోన్నత వ్యక్తి, నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు యోధుడు సీఆర్ మోహన్ స్మారక స్థూప ఆవిష్కరణ ఈ నెల 31వ తేదీ నిర్వహిస్తున్నట్లు సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామ సుబ్బాయమ్మ తెలిపారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో సీఆర్ మోహన్ స్మారక స్థూపం ఆవిష్కరణ కార్యక్రమ కరపత్రాలను సీపీఐ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ చిలకలూరిపేట ప్రాంత ప్రజా సమస్యలతో పాటు రైతాంగ, కార్మిక పోరాటాలకు సీఆర్ మోహన్ అగ్ర భాగంలో నిలిచారని కొనియాడారు. మున్సిపల్ కౌన్సిలర్‌గా అనేక సమస్యలను వెలుగులో తెచ్చి వాటి పరిష్కారానికి కృషి చేశారని, ప్రజా నాట్య మండలి కళకారుడుగా సమాజంలోని రుగ్మతల నిర్మూలన కోసం పాటుపడ్డారని తెలిపారు. అటువంటి మోహన్‌రావును స్మరించుకుంటూ చిలకలూరిపేట పట్టణంలోని నరసరావుపేట సెంటర్‌లో సీఆర్ మోహన్ స్మారక స్థూపం ఏర్పాటు చేశారని వివరించారు. ఈ స్థూపాన్ని మంగళవారం సాయంత్రం 4గంటలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో రామకృష్ణతో పాటు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ తదితర నాయకులు పాల్గొంటారని అన్నారు. అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, అభిమానులు, సీఆర్ మోహన్ సన్నిహితులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, నాయకులు బొంతా భగత్‌సింగ్, లక్షాధికారి తదితరులు పాల్గొన్నారు.

హాజరుకానున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : అక్టోబర్ 31న 104వ ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు కంబాల శ్రీనివాస్ విలేఖరులతో మాట్లాడుతూ అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) మన భారతదేశంలో మొట్టమొదటి కేంద్ర కార్మిక సంఘం 1920 అక్టోబర్ 31న దేశ వాణిజ్య రాజధాని ముంబాయి నగరంలో పురుడు పోసుకున్నదని అన్నారు. మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతున్న రోజులలో కార్మిక గర్జనల నుంచి ఏఐటీయూసీ ఆవిర్భవించిందని చెప్పారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం అందరికన్నా ముందే నిలిచిన సంఘం ఏఐటీయూసీ అన్నారు. దేశ స్వాతంత్ర్య సముపార్జన కోసం పోరు సలిపిన సంఘం ఏఐటీయూసీ అని, కార్మిక హక్కుల కోసం జీవన ప్రమాణాలు మెరుగుదల కోసం అలుపెరగని పోరాటాలు చేసిందన్నారు. కార్మికవర్గం నేడు అనుభవిస్తున్న సౌకర్యాలను అమల్లో ఉన్న చట్టాలను ఎన్నిటినో సాధించింది ఏఐటీయూసీ అని చెప్పారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే కార్మిక వ్యతిరేక రాజకీయ ఆర్థిక విధానాల వల్ల ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు చేయడంలో రోజురోజుకు ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్యను కుదిస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులపై మునుపెన్నడూ లేని రీతిలో దాడులు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. సరళీకరణ ఆర్థిక విధానాలకు ప్రభుత్వ రంగ సంస్థల వాటాల విక్రయానికి ఎఫ్‌డీఐ వంటి వాటికి వ్యతిరేకంగా కార్మిక హక్కుల పరిరక్షణ కోసం పెట్టుబడిదారులకు ఇప్పటివరకు కలగా ఉన్న కార్మిక చట్టాలు మార్పుపైన మోదీ ప్రభుత్వం ప్రధాన దృష్టిని కేంద్రీకరించిందని ఉద్యోగుల నియామకం తొలగింపులో పూర్తి స్వేచ్ఛను యాజమాన్యాలకు దారాదత్తం చేసే నిర్ణయాలు చేసిందని విమర్శించారు. దేశంలో కార్మిక వర్గం నెత్తురు చిందించి ప్రాణ త్యాగాలు చేసి సాధించిన కార్మిక చట్టాలను రూపుమాపి కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకురావడం చాలా దారుణమని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ రంగాలను పరిరక్షించేందుకు కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు దేశవ్యాప్తంగా కార్మికులు పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 31న ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని కార్మికులకు కంబాల పిలుపునిచ్చారు.

బాపయ్య చిత్రపటానికి జంగాల నివాళి

విశాలాంధ్ర-మంగళగిరి: పెద్దవడ్లపూడి గ్రామంలోని భావన బాపయ్య వర్ధంతి జరిగింది. మంగళగిరి ఏరియా రైతు సంఘం నాయకులు కామ్రేడ్ భావన భాపయ్య 17వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. రైతులతో మమేకమై రైతు సమస్యలు పరిష్కరించడంలో తను ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ముసునూరి సుహాస్, ఆవుల బసవ పున్నయ్య, జవ్వాది సాంబశివరావు, చిట్టి బొమ్మ శ్రీనివాసరావు రాజారావు జాన్ సైదా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే వైసీపీ బస్సు యాత్ర

విశాలాంధ్ర-పెదకూరపాడు : ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు సామాజిక బస్సు యాత్ర చేపట్టారని తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. వైసీపీ నాయకులు సామాజిక బస్సు యాత్ర పేరుతో ప్రజలకు ఏమి చేశామో చెప్పలేక ప్రతిపక్ష పార్టీ నాయకులపై నోరు పారేసుకుంటున్నారన్నారు. బీసీలకు చాలా చేశామని చెప్పుకుంటున్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం బీసీలకు ఉన్న రిజర్వేషన్ ఎందుకు తగ్గించారని బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి గొప్పగా ఉద్ధరించామని చెబుతున్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం బీసీ సామాజిక వర్గానికైనా, దళితులకైనా ఒక్క రూపాయి నిధులు ఇచ్చారా అని ప్రశ్నించారు. కనీసం కార్పొరేషన్ చైర్మన్‌లకు కుర్చీలైనా వేశారా అని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో బీసీలలో గాని దళితులలో గాని కుల వృత్తుల వారు ఉంటే వారికి ఆదరణ పథకం కింద పనిముట్లు, ఆధునిక యంత్రాలు ఇచ్చారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం ఏ సామాజిక వర్గానికి ఇచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎక్కువగా బీసీలపై, దళితులపై దాడులు దౌర్జన్యాలు చేయడం, భూములు లాక్కోవడం వంటివి జరుగుతున్నాయని అన్నారు. 2024లో జరగబోయే ఎన్నికలలో చంద్రబాబు గెలిచి ముఖ్యమంత్రి అవుతారని గంగాధర్ అన్నారు.

ఫ్రీజర్ బాక్స్ వితరణ

విశాలాంధ్ర-యడ్లపాడు : మండల కేంద్రమైన యడ్లపా డుకు చెందిన తుర్లపాటి చిన భోగిలింగాచారి(చిన భోగి) జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సాధన సేవా సంస్థ సహకారంతో రూ.70 వేల విలువైన మృతదేహం ఉంచే ఫ్రీజర్ బాక్స్ వితరణ చేశారు. ఫ్రీజర్ అవసరమైన వారికి అందుబాటులో ఉండే సౌకర్యార్థం యడ్లపా డులోని భూషయ్య మెమోరియల్ నర్సింగ్ హోమ్ యాజమాన్యానికి బాక్స్‌ను అప్పగించారు. కులమతాలకు అతీతంగా ఎవరైనా ఫ్రీజర్‌ను ఉచితంగా విని యోగించుకోవచ్చని సాధన సేవా సంస్థ నిర్వాహకులు కేతా రామబ్రహ్మం తెలి పారు. ఫ్రీజర్ అవసరమైన వారు 99083 99169, 99080 56033 సెల్ నంబర్లు లేదా నేరుగా ఆసుపత్రి సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ అందజేత

విశాలాంధ్ర-చిలకలూరిపేట : సమాజానికి తమ వంతు సేవ చేయాలన్న తలంపు అభినందనీయమని ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు అన్నారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట సమావేశం ఆదివారం రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీవీ సుబ్బారావు, ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు విజయలక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవం పురస్కరించుకొని రూ. 11వేల విలువ చేసే కుట్టుమిషన్ పేద మహిళ సునీతకు అందజేశారు. ఇలాంటి సేవలను మిగిలిన వారూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఇన్నర్‌క్లబ్ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ పీవీ సుబ్బారావు మాట్లాడుతూ సహాయం పొందిన మహిళ మరికొందరికి కుట్టు శిక్షణ అందిస్తే వారికి సైతం తాము కుట్టుమిషన్ అందజేస్తామని తెలిపారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఇందిరా, పాస్ట్ ప్రెసిడెంట్ గట్టు సరోజిని, సభ్యులు ఉప్పాల రమాదేవి, నల్లపాటి రాజ్యాలక్ష్మి పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో మహిళ అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : పట్టణంలో 52 ఎకరాల్లో నిర్మించిన టిడ్కో గృహాల్లో మహిళ అనుమానాస్పందంగా మృతి చెందింది. ఆమెను షేక్ ముంతాజ్ (43)గా గుర్తించారు. మూడు రోజుల కిందట మృతి చెంది ఉంటుందని భావిస్తున్న ముంతాజ్ మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి దుర్వాసన వస్తుంది. సమీప నివాస గృహవాసులు పోలీసులకు సమాచారం అందించటంతో తలుపులు పగలగొట్టి చూడగా మృతదేహం కనిపించింది. ఆమె కృష్ణమహల్ సెంటర్‌లో సమీపంలో నివాసం ఉంటుందని, టిడ్కో గృహాల్లో ఇల్లు ఇవ్వడంతో అక్కడికీ వెళ్లి వస్తుందని కొంతమంది చెబుతున్నారు. వంట పనులకి వెళ్తూ జీవనం కొనసాగిస్తూ ఉంటుంది. మృతురాలి భర్త గతంలోనే చనిపోగా, ఆమెకు ఒక పాప, ఒక బాబు ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అర్బన్ సీఐ సీతారామయ్య ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో ముస్లిం నాయకత్వం అవసరం

విశాలాంధ్ర-వినుకొండ: ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలో రాష్ట్రస్థాయి మజ్లీస్ పార్టీ నాయకుల, కార్యకర్తల ముఖ్య సమావేశంలో పాల్గొన్న వినుకొండ మజ్లీస్ పార్టీ అధ్యక్షులు షేక్ బాజీద్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లింల నాయకత్వం అవసరమని ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ముస్లిం మైనారిటీలను ఓటు బ్యాంక్ గానే వాడుకుని ముస్లిం సమాజానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గడచిన కొన్ని రోజుల క్రితం పార్టీ అధినేత బారిస్టర్ అసదుద్దీన్ ఓవైసీ కేంద్ర పార్టీ కార్యాలయంలో ఆంధ్ర మజ్లీస్ పార్టీపై చెప్పిన అభిప్రాయాన్ని బాజీద్ గుర్తు చేశారు ఆయన అడుగుజాడల్లో రానున్న రోజుల్లో మజ్లీస్ పార్టీని ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేసి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మజ్లీస్ పార్టీ అభ్యర్థులను ఆంధ్ర ప్రదేశ్ లో పోటీ చేసే విధంగా అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తామని ఆ పార్టీ నాయకులు షేక్ బాజీద్ విలేకరుల సమావేశంలో తెలియజేశారు. త్వరలో వినుకొండ పట్టణ వేదికగా రాష్ట్రస్థాయి మజ్లీస్ పార్టీ నాయకుల సమావేశం ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నేతల వినూత్న నిరసన

విశాలాంధ్ర-శావల్యాపురం: టీడీపీ పిలుపు మేరకు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మండలంలోని స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నేతలు కళ్ళకు గంతలు కట్టుకొని వినూత్న నిరసన కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాలడుగు సత్యనారాయణ, నలమాటి వెంకటేష్, చెరుకూరు బాలకృష్ణ, పత్తిపాటి కోటిలింగం, దూదేకుల మస్తాన్, చెవల శ్రీరాములు, దావులూరు పెద్ద బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-సత్తెనపల్లి రూరల్: కళ్లు తెరిపిద్దాం-న్యాయం గెలవాలి అనే కార్యక్రమం సత్తెనపల్లి పట్టణంలోని రఘురాం నగర్‌లో కన్నా లక్ష్మి నారాయణ ఆదేశానుసారం నిర్వహించటం జరిగింది. కార్యక్రమంలో టీడీపీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గన్నమనేని శ్రీనివాదరావు, మాజీ కౌన్సిలర్ చుక్కపల్లి కేశవరావు, 11వ వార్డు అధ్యక్షులు చుక్కపల్లి కొండలరావు, తెలుగు మహిళా నేత మన్నెం శారద దేవి, చుక్కపల్లి శ్రీనివాసరావు, ధనేకుల సాంబశివరావు, మన్నెం వేంకట రామయ్య, గురజాల సరోజిని, నిమ్మగడ్డ నాగ జ్యోతి, చుక్కపల్లి శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-వినుకొండ: నిజం గెలవాలి... చంద్రబాబు కి వేసిన సంకెళ్లు బద్దలు కావాలి. అది జరగాలంటే జగనాసురునికి కనువిప్పు కావాలి అంటూ ఆదివారం వినుకొండ పట్టణంలోని గంగినేని కళ్యాణమండపం నందు కళ్ళకు గంతలు కట్టుకొని చంద్రబాబుకి మద్దతుగా నిజం గెలవాలి అంటూ గట్టిగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు వినుకొండ మాజీ శాసనసభ్యులు జి.వి ఆంజనేయులు మరియు నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-మంగళగిరి: చంద్రబాబు అక్రమ నిర్బంధాన్ని నిరసిస్తూ మంగళగిరి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద టీడీపీ శ్రేణులు 'కళ్లు తెరిపిద్దాం' నిరసన కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. రాత్రి 7 నుంచి 7.05 గంటల వరకూ 'జగనాసుర చీకటి పాలనకు నిరసనగా కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. సీఎం ఇప్పటికైనా కళ్ళు తెరవాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగానే వాయిదాలు అడుగుతూ చంద్రబాబు రిమాండు కొనసాగిస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా ప్రజలు వైకాపాను బంగాళాఖాతంలో కలపడం ఖాయమన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి అమానుషం

విశాలాంధ్ర-వినుకొండ: ఇటీవల నెల్లూరు జిల్లా కావలి వద్ద ఆర్టీసీ డ్రైవర్ రామ్ సింగ్ పై అధికార పార్టీ గూండాలు చేసిన దాడిని ఖండిస్తూ రాష్ట్ర కమిటీ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపుమేరకు ఆదివారం డిపో ఉద్యోగులు ఉదయం 5 గంటల నుండి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తూ విధులకు హాజరయ్యారు. అనంతరం అధిక సంఖ్యలో ఉద్యోగులు హాజరై గేట్ మీటింగ్ నిర్వహించారు. డ్రైవర్‌పై జరిగిన దాడిని ముక్తకంఠంతో ఖండించారు. ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు షేక్ ఖాజా అధ్యక్షత వహించి మాట్లాడుతూ డ్రైవర్‌పై జరిగిన దాడి పట్ల వెంటనే స్పందించిన ఆర్టీసీ ఎండికు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకొని ఆర్టీసీ ఉద్యోగులకు ధైర్యాన్ని కల్పిస్తూ విధులు సక్రమంగా నిర్వహించేందుకు మనోధైర్యాన్ని కలిగించాలని కోరారు. డిపో సెక్రటరీ మరియు డిపో నాయకులు మాట్లాడుతూ బస్టాండ్ మరియు బస్సులలో ఉన్న ఉద్యోగులపై దాడి చేస్తే ఐపిసి సెక్షన్ 186, 189, 353 ల ప్రకారం శిక్ష పడుతుందని బోర్డుల ద్వారా ప్రకటనలు చేయాలని ఉద్యోగులకు ప్రాణ రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ నాయకులు కె హరిబాబు, జిల్లా నాయకులు కే రమేష్ బాబు, టిఎస్ రావు, ఎం బాబురావు, డిపో నాయకులు సెక్రటరీ పి సాంబశివరావు, గణపవరం శ్రీనివాసరావు, సిసిఎస్ డెలిగేట్ టి రవిబాబు, ఏ. ఆంజనేయులు మధుబాబు, మరియు అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

నిజం గెలవాలి

విశాలాంధ్ర-అచ్చంపేట : జగనాసురుడి కళ్ళు తెరిపిద్దాం అనే కార్యక్రమాన్ని పెదకూరపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ పిలుపు మేరకు అచ్చంపేట మండల కేంద్రమైన ఎన్టీఆర్ విగ్రహం వద్ద నాయకులు కార్యకర్తలు నిజం గెలవాలి సైకో పోవాలి అనే నినాదంతో చంద్రబాబుకి సంఘీభావంగా కళ్ళకు గంతాలు కట్టుకుని నినాదాలు హోరెత్తించారు. బాబుపై కక్షపూరితంగా తప్పుడు కేసులు నమోదు చేసి నిరూపించకుండా కాలయాపన చేస్తూ ప్రజల సొమ్మును అధికారాన్ని దుర్వినియోగం పరుస్తున్న సీఎం జగన్ రెడ్డి అని వారన్నారు.: ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నందిగం ఆశీర్వాదం రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు నల్లమేకల వెంకటేశ్వర్లు క్లస్టర్ ఇన్‌ఛార్జ్ బత్తుల శ్రీనివాసరావు, వెనిగళ్ళ కోటయ్య, తాళ్లూరు సుబ్బారావు, ఎడ్లపల్లి బుచ్చిబాబు, సందెపోగు వెంకయ్య రాయుడు, సాంబశివుడు, చల్లా అనుపమ కళ, షేక్ కాసుల రేపుడి తామస్ తిరువాయి, పాటి ఆంజనేయులు, జంగం శివారెడ్డి, తమ్మా కిషోర్ రెడ్డి, చెమట శ్రీనివాసరావు, ఏపూరి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

జనసైనికుల పోరాటమే రాష్ట్రానికి శ్రీరామరక్ష

విశాలాంధ్ర-గుంటూరు : ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ కొనసాగిస్తున్న రాక్షసపాలన నుంచి ప్రజల్ని రక్షించుకునేందుకు జనసైనికులు చేస్తున్న పోరాటమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు కొణిదెల నాగేంద్రబాబు జన్మదినం సందర్భంగా 22వ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ షర్ఫుద్దీన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీనివాసరావుతోటలోని గాజు గ్లాసు దిమ్మె వద్ద బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మెగాఫ్యామిలీ అభిమానులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి వారిని సమాజ సేవకులుగా మార్చిన ఘనత నాగేంద్రబాబుదేనని కొనియాడారు. జనసైనికులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తూ వారిని రాజకీయ యుద్ధరంగంలో కార్యోన్ముఖులుగా తీర్చిదిద్దటంలో నాగబాబు పాత్ర స్ఫూర్తి దాయకమని ఆళ్ళ హరి అన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి బండారు రవీంద్ర, మెహబూబ్ బాషా, డివిజన్ అధ్యక్షులు గద్దం రోశయ్య, కొలసాని బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి: జీవి

విశాలాంధ్ర-వినుకొండ: టీడీపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు కోరారు. ఆదివారం నరసరావుపేట రోడ్డులోని గంగినేని ఫంక్షన్ హాల్ లో జరిగిన వినుకొండ నియోజకవర్గం స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక మరణించిన వారి చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నర ఏళ్ల అరాచక వైసిపి పాలనతో కార్మికులు రైతులు సామాన్య ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను ప్రజల్లోకి తీసుకువెళ్లి రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర పార్టీ పిలుపును అందుకుని కార్యక్రమాలు గ్రామీణ స్థాయిలో చేపట్టి ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని విస్తృతంగా తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు, టిడిపి గెలుపు భయంతో అరాచక వైసిపి వ్యవహరిస్తున్న దుర్మార్గాన్ని ప్రజలకు తెలియపరచాలన్నారు. వినుకొండ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు చేసిన అవినీతి అక్రమాలు దౌర్జన్యాలు ప్రశ్నించిన వారిపై అక్రమ కేసుల బనాయింపు అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాల్సిన అవసరం ఉందన్నారు. అధికారం అడ్డం పెట్టుకొని ప్రభుత్వ భూములను కబ్జా చేసుకుని వందల కోట్లు అక్రమంగా డ్యూటీ చేసిన అంశాలను ప్రతి ఒక్కరికి టిడిపి కార్యకర్తలు తెలియపరచాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు.. పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఆయుబ్ ఖాన్,మండల పార్టీ అధ్యక్షులు జరపాల గోవిందు నాయక్. ఈపూరు మండల పార్టీ అధ్యక్షులు తిరుమాల శెట్టి బాలయ్య. మాదినేని ఆంజనేయులు. మీసాల మురళి కృష్ణ యాదవ్.గుంటూరు సాంబశివరావు,పెమ్మసాని నాగేశ్వరావు.పెసల వెంకట నారాయణ.అయినాల కోటేశ్వరరావు.గడిపుడి విశ్వనాథం.రాపర్ల జగ్గారావు.పతి పూర్ణ చద్రరావు,పి.వి.సురేష్ బాబు ,సౌదగర్ జాని బాష,సోమేపల్లి బ్రహ్మయ్య,బచ్చు అంజిరెడ్డి ,గాన్నమనేని వ్వెంకయ్య .వంకయలపతి పేరయ్య .పలుప్రు నాయకులు పాల్గొన్నారు.

సైకో పోవాలి-సైకిల్ రావాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా వినూత్న రీతిలో కళ్ళకి గంతలు కట్టుకొని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కొమ్మలపాటి శ్రీధర్ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతలపై కేసులు పెట్టడం దుర్మార్గపు చర్య అని, సైకో పోవాలి సైకిల్ రావాలి నినాదంతో ప్రజల్లోకి వెళ్తామని, ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గ చర్యలను ప్రజలకు వివరించి జగన్‌కి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. పెదకూరపాడు మండల పరిధిలోని 20 గ్రామాలలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కళ్ళకి గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపూరి నాగేశ్వరరావు, అత్తి మల్ల రమేష్, భాష, ఆంజనేయులు, బెల్లంకొండ రాం గోపాలరావు, గల్లా బాబురావు, షేక ముంతాజు, నెల్లూరు మల్లికార్జునరావు, మక్కిన సాగర్, మిలిటరీ మౌలాలి, వెల్లలచెరువు సురేష్, నాదెండ్ల కల్పన, ముంతాజ్, గంగినేని లీలావతి, రఘు, గల్లా శివ పాల్గొన్నారు.

మల్లవరంలో పోలీసులు తనిఖీలు

విశాలాంధ్ర-రెంటచింతల : మండలంలోని మల్లవరంలో ఆదివారం తెల్లవారుజామునసే పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దు గ్రామం కావటం అక్కడ ఎన్నికల నగారా మోగటంతో తనిఖీలలో ప్రాధాన్యత పెరిగింది. సారా తెలంగాణ మద్యం నిల్వలపై ఆరా తీసారు. తనిఖీలలో కారంపూడి సీఐ జయరావు, స్థానిక ఎస్సై శ్యాముల్ రాజీవ్ కుమార్ రెంటచింతల, దుర్గి పోలీసులు పాల్గొన్నారు.

మద్యం షాపు వద్దు.. మహిళల నిరసన

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని పాటిబండ్ల గ్రామంలో ఎక్సైజ్ శాఖ ఏర్పాటు చేయనున్న కొత్త మద్యం షాపును నిరసిస్తూ మహిళలు, గ్రామ ప్రజలు కలిసి జేసీ శ్యాం ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. గ్రామంలో మద్యం తాగి గతంలో హత్యలు చేసి జీవిత ఖైదీ అనుభవిస్తున్న వారు ఉన్నారని మహిళలు తెలిపారు. గతంలో ఉన్న మద్యం షాపుని గ్రామం నుంచి తొలగించామని, నేడు మళ్ళీ అదనంగా ఇస్తున్న షాపుల్లో పాటిబండ్ల గ్రామం పరిశీలన ఉందని మా గ్రామంలో మద్యం షాపు వద్దని మహిళలు పెద్దఎత్తున నిరసన తెలిపారు. అధికారులు ఆదాయం కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు. తమ గ్రామంలో మద్యం షాపు ఏర్పాటు చేస్తే మహిళలు ధ్వంసం చేసేందుకైనా సిద్ధంగా ఉన్నామని వారు అన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు పునఃపరిశీలన చేసి పాటిబండ్ల గ్రామంలో మద్యం షాపు ఏర్పాటు చేయొద్దని మహిళలు, గ్రామవాసులు కోరారు.

గర్జనకు నూర్ బాషా సంఘం నాయకులు

విశాలాంధ్ర-మాచర్ల : ముస్లిం దూదేకుల సంఘం ఐక్యతను చాటి చెబుతూ, దూదేకులకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేస్తూ గుంటూరులో తలపెట్టిన ముస్లిం దూదేకుల సింహగర్జన కార్యక్రమానికి ఆ సంఘం నాయకులు ఆదివారం మాచర్ల నుంచి వేలాదిగా తరలివెళ్లారు. ముందుగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా అధ్యక్షులు జానీ భాష, మాచర్ల నియోజకవర్గ అధ్యక్షులు సైద్ మస్తాన్ విలేకరులతో మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు నూర్ భాషా దూదేకుల ముస్లింలకు చట్టసభల్లో తగిన ప్రాధాన్యత కల్పించి, అధికారంలో భాగస్వామ్యం ఇవ్వాలని, మైనార్టీ పదవులలో వర్గీకరణ, దూదేకుల అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికలలో ఏ రాజకీయ పార్టీ అయితే నూర్ భాషా దూదేకుల ముస్లింలకు చట్టసభలలో అవకాశం కల్పిస్తుందో ఆ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇస్తామని వారు స్పష్టం చేశారు. సింహ గర్జనకు మాచర్ల, రెంటచింతల, దుర్గి, కారంపూడి, వెల్దుర్తి, నాగార్జునసాగర్ నుంచి 100 వాహనాలలో భారీగా తరలివెళ్ళినట్టు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఆర్గనైజర్ బాదన్ భాయ్, పల్నాడు టీవీ జానీ, న్యూ స్టార్ వలీ, షఫీ, సుభాని, యాసిన్, జబ్బార్ మాష్టర్, నాయిబ్ హుస్సేన్, పీర్ సాహెబ్, చాంద్ బాషా, షేక్ సైదా, మీరావలి, సంషుద్దీన్, చాంద్ బాషా, కారంపూడి అధ్యక్షుడు షేక్ సైదా, నజీర్, శ్రీను బాషా పాల్గొన్నారు.

పాఠశాలలో వసతులు లేక విద్యార్థుల అవస్థలు

విశాలాంధ్ర-శావల్యాపురం : మండల కేంద్రమైన శావల్యాపురంలోని జడ్పీ పాఠశాలలో మౌళిక వసతులు సక్రమంగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బం దులకు గురవుతున్నారు. నాడు-నేడు పదకం ద్వారా పాఠశాలకు రెండు విడతలు తరగతి గదులు నిర్మాణానికి మాత్రమే నిధులు కేటాయించడంతో మరమ్మత్తులు నిలిచిపోయాయి. పాఠశాలలో దాతలు ఇచ్చిన మినరల్ వాటర్ ప్లాంట్ పదేపదే మరమ్మత్తులకు గురి కావడంతో పాటు పాఠశాలలో విద్యుత్ వినియోగానికి సరిపడా కెపాసిటీ లేకపోవడంతో మోటర్లు ఎక్కువ సమయం పని చేయక విద్యార్థులకు సరిపడా తాగునీరు అందడం లేదు. పాఠశాలలోని బోరింగ్ మరమ్మత్తులకు గురై నెలలు గడుస్తున్నా పట్టించుకున్న వారు లేరని విద్యార్థులు వాపోతున్నారు. మధ్యాహ్న భోజనం సమయంలో కొంతమంది విద్యార్థులు పాఠశాల బయటకు వెళ్ళి తాగునీరు కొనుక్కొని తాగాల్సిన పరిస్థితి నెలకొంది. తరగతి గదుల్లో ఫ్యాన్లకు ఓల్టేజీ సరిపోక చిన్నగా తిరుతుండడంతో ఉక్కపోతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలలోని బాలురకు రూ.7.50లక్షలతో మరుగుదొడ్లు నిర్మించి ఏళ్ళు గడుస్తున్నా కాంట్రాక్టర్‌కి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో వాటిని ప్రారంభించకుండా నిరుపయోగంగా వదిలేశారు. దాంతో ఆకతాయిలు రాత్రి వేళల్లో మరుగుదొడ్డులోకి ప్రవేశించి బేసిన్లు, ట్యాప్లు పగులగొట్టారు. విద్యార్థులు మూత్ర విసర్జనకు గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపైకి రావడంతో ఇటీవల కొంత మంది విద్యార్థులు ప్రమాదాల బారిన పడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో సమస్యలు పరిష్కరించి విద్యార్థులకు మౌళిక వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రిజిస్ట్రేషన్ చేసిన భూములకు హక్కులు కల్పించండి

విశాలాంధ్ర-శావల్యాపురం : గతంలో ప్రభుత్వం రిజిస్టర్ చేసిన అసైన్డ్ భూములకు రీసర్వేలో హక్కులు కల్పించకుండా అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని కొందరు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం 20 ఏళ్ళ నుండి రైతుల ఆధీనంలో ఉన్న అసైన్డ్ భూములకు హక్కులు కల్పిస్తున్నట్లు ప్రకటించిందే గానీ క్షేత్రస్థాయిలో ఏ ఒక్కరం హక్కులు పొందలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. 1954కి ముందు బడుగు, బలహీనవర్గాల పేదలకు ప్రభుత్వం కొంత సాగు భూమినిచ్చి వారి పేరుతో పట్టాలిచ్చింది కానీ వారంతా కాలక్రమేణా ఆయా భూములను అమ్ముకొన్నారు. వాటిని కొనుక్కొన్న రైతులు సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారు. కానీ ప్రభుత్వం ఎవ్వరికైతే పట్టాలిచ్చామో వారి ఆధీనంలో ఉంటేనే హక్కులు కల్పిస్తామని షరతులు పెట్టడంతో రైతులలో ఆందోళన నెలకొంది. ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు చేయనట్లయితే ఆయా భూములను తాము కొనుక్కొనే వాళ్లం కాదుగా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాంతో పాటు కొన్ని గ్రామాలలో నీటి కుంట భూములను ప్రభుత్వం సబ్ డివిజన్లు చేసి ఆర్ హేచ్ నందు కూడా నమోదు చేసింది. కానీ రీసర్వేలో ఇప్పుడా భూములకు హక్కులు కల్పించకుండా నిషేధిత జాబితాలలో పెట్టడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని స్థానిక రెవెన్యూ అధికారులను అడిగితే నిషేధిత జాబితాలో పెట్టిన భూములకు దరకాస్తులు తీసుకోవద్దని ఉన్నతాధికారులు ఆంక్షలు విధించారని చెప్పడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసిన భూములకు రీసర్వేలో హక్కులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఏం సాధించారని సామాజిక సాధికార బస్సు యాత్ర?

విశాలాంధ్ర-చిలకలూరిపేట : రాష్ట్రంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఏం ఘనత సాధించారని సామాజిక సాధికార బస్సు యాత్ర వారి మంత్రుల చేత చేయిస్తున్నారని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి. శ్రీను నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, ఆయా సామాజిక వర్గీయుల వారి సంక్షేమ పథకాలను రద్దు చేసి దానికి సంబంధించిన నిధులను సంక్షేమ పథకాలకు వాడుకున్నందుకా? కార్పొరేషన్లు పెట్టి వాటిని నిర్వీర్యం చేసి ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటుతనానికి గురి చేయడమే కాకుండా కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వనందుకా? గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైనందుకా? గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలను, గిరిజన గురుకులాల్లో ఉపాధ్యాయ పోస్టులను, గిరిజన యూనివర్సిటీలను గాలికి వదిలేసినందుకా అంటూ పలు ప్రశ్నలు సంధిం చారు. పల్నాడు జిల్లాలో వరికపూడి శెల ప్రాజెక్ట్ పూర్తి చేస్తే వినుకొండ, మాచర్ల నియోజకవర్గంలోని సుమారు 50 మండల ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు కొరత తీరుతుందని సాక్షాత్తు వారి ఎంపీయే చెబుతున్న పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కృష్ణ, చిత్తూరు, పల్నాడు జిల్లాలకు చెందిన గిరిజన నాయకులు మాట్లాడే విధానం చూసి ఆశ్చర్యం కలుగుతుందని, బీసీ సామాజిక వర్గీయులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీ సాక్షిగా తీర్మానం చేసిన సీఎం జగన్మోహన్ రెడ్డి గురించి ఆనాడు మాట్లాడాలని కొంతమంది నేతలు వారి మెప్పు పొందడం కోసం రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని మాట్లాడడం వారి అనాలోచిత నిర్ణయాలు సిగ్గుచేటుగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి చరమ గీతం పాడేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని, జిల్లాలో బస్సు యాత్రను గిరిజన, ప్రజా సంఘాలతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు.

నిరాశ్రయులకు రెడ్‌క్రాస్ చేయూత

విశాలాంధ్ర - కర్లపాలెం : అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కర్లపాలెం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీసు రావు అన్నారు.గతవారం మండలం యాజలిలో విద్యుత్ సర్క్యూట్ వలన జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఇక్కుర్తి శ్రీనివాసరావు కుటుంబాలకు రెడ్ క్రాస్ సొసైటీ చేయూత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు రావు మాట్లాడుతూ బాపట్ల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బి.ఎస్ నారాయణ బట్టు సలహా ప్రకారంగా చేయూత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా తాత్కాలిక గుడారం ఏర్పాటుకు పట్టాలను, వంట సామాగ్రిని, నిత్యవసర వస్తువులను అందించినట్లు తెలిపారు.

వైభవంగా పోతురాజు విగ్రహం పునఃప్రతిష్ఠ

విశాలాంధ్ర - యద్ద నపూడి : మండలం లోని అనంతవరం గ్రామంలో పోలేరమ్మ అమ్మవారి దేవస్థా నంలో పోతురాజు స్వామి విగ్రహం పునప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిగింది. గ్రామస్తుల సహాయ సహకారాలతో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిష్టానంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

నియోజకవర్గంలో ఓటర్ల పెరుగుదల

విశాలాంధ్ర - చీరాల రూరల్ : నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల జాబితాలో 192490 మంది లెక్కతేలారు. ఇందులో మహిళలే పురుషుల కన్నా ఎక్కువగా ఉన్నారు. 18 మంది ట్రాన్స్ జండర్లు ఉన్నారు. గతంలో ఉన్న తుది ఓటరు జాబితా కన్నా ముసాయిదా ఓటరు జాబితాలో 3138 మంది ఓటర్లు పెరిగినట్లు తహశీల్దార్ ప్రభాకరరావు తెలిపారు. అభ్యంతరాలు ఉంటే విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

విశాలాంధ్ర-కొల్లూరు : పేకాట శిబిరంపై దాడులు నిర్వహించిన కొల్లూరు పోలీసులు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్న సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. కొల్లూరు మండలపరిధిలోని కిష్కిందపాలెంలో జోరుగా పేకాట నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో కొల్లూరు ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి సిబ్బందితో కలసి ఆకస్మిక దాడులు నిర్వహించి 11 మంది జూదరులను అరెస్టు చేశారు. రూ. 15, 700 నగదు స్వాధీనం చేసుకుని, నగదుతో పాటు నింధితులను కోర్టుకు హాజరుపర్చనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఢిల్లీకి చీరాల మట్టి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా మేరా మట్టి మేరా భారత్ వేడుకల కోసం చీరాల నుండి మట్టిని సేకరించి ఎంపీడీఓ కార్యాలయ అధికారులు ఒంగోలు జడ్.పి కార్యాలయానికి ప్రత్యేక ప్యాకేజీ చేసి పంపారు. ఈ సందర్భంగా పరిపాలనాధికారి శ్రీనివాసరావు మాట్లా డుతూ మండలంలోని పదిహేను పంచాయతీల నుండి సేకరించిన మట్టిని ఒక బిందెలో భద్రపరచి ఒంగోలు తరలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అమర్నాథ్, వెంకట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : బాపట్ల జిల్లాలోని అరబిందో ఎమర్జెన్సి మెడికల్ సర్వీస్ 108,104,102 వాహనాలలో డ్రైవర్లుగా పనిచేయడానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ పి.బాలకృష్ణ ఒక ప్రకటనలో కోరారు. పదవ తరగతి ఉత్తీర్ణులై 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగి శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు చీరాల ఏరియా ఆస్పత్రిలో ఉన్న 108 కార్యాలయంలో సోమవారం దరఖాస్తులు అందజేయాలన్నారు.వివరాల కోసం 83095 30078, 88851 07040లను సంప్రదించాలన్నారు.

టీడీపీ జనసేన ఒకటిగా కలిసి సాగుదాం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : తెలుగుదేశం,జన సేన పార్టీలు సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని కలసి ముందుకు సాగి రానున్న ఎన్నికలలో జయభేరి మోగిద్దామని నియోజకవర్గ తెదేపా ఇంఛార్జి ఎం.ఎం కొండయ్య అన్నారు. ఒంగోలు ఎం.ఎస్ ఫంక్షన్ హాలులో జరిగిన ఉమ్మడి ప్రకాశం జిల్లా తెలుగు దేశం, జన సేన పార్టీల సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. అక్కాయపాలెం పంచాయితీ అబ్దుల్ కలాం కాలనీలో ఇంటింటికి తిరిగి చంద్రబాబు అక్రమ అరెస్టును వివరిస్తూ ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు.తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపు మేరకు కళ్ళకు గంతలు కట్టుకుని కళ్ళు తెరిపిద్దాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో తెదేపా నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులు

విశాలాంధ్ర-తాడేపల్లి : ఉమ్మడి గుంటూరు జిల్లాలో స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఆటల పోటీలతో పాటు కరాటే పోటీలను కూడా నిర్వహిస్తున్నారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కుంచనపల్లి అరవింద్ స్కూల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన కరాటేకు విద్యార్థులకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధికారి డాక్టర్ ఉదయ్ కరాటే పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు, బాపట్ల, నరసరావుపేటలోని పలు పాఠశాలల నుంచి 70 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని, కరాటేలో నైపుణ్యం సంపాదించిన నడుమ ఈ పోటీలను నిర్వహించామని, 30 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో తమ ప్రతిభను చూపించేందుకు ఎంపికయ్యారని అన్నారు. నవంబర్ 9, 10, 11 తేదీల్లో పార్వతీపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ ప్రతిభను కనబరుస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు అనీల్, మాలిక్, మహేష్, కిరణ్ రెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పల్లె నిద్రలో వైసీపీ నాయకులు దోమతెరలు వాడాలి

సీపీఐ సీనియర్ నాయకులు శ్రీధర్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : వైసీపీ నాయకులు పల్లె నిద్రలో దోమతెరలు వాడాలని సీపీఐ సీనియర్ నాయకులు జెల్లి భాగ్య శ్రీధర్ అన్నారు. పట్టణంలోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశానుసారం రాష్ట్రంలో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు అందరూ పల్లెనిద్ర బాట పట్టారని తన సలహా స్వీకరించాలని విన్న వించుకున్నారు. దోమలు విపరీతంగా ఉన్న కారణంగా పల్లెనిద్రలో దోమ కాటుకు గురైతే నాయకులు అనా రోగ్యం కారణంగా ఆసుపత్రిపాలై లక్షల్లో ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది కావున ప్రజాధనం వృధా కాకుండా ఉండాలంటే పల్లెనిద్రలో నాయకులు దోమతెర వాడాలని తెలిపారు. మున్సిపాలిటీలో మున్సిపల్ అధికారులు దోమల నివారణ చర్యలు చేపట్టని కారణంగా 34వార్డుల్లో దోమలు విపరీతంగా పెరిగి దోమకాటుకు డెంగ్యూ, మలేరియా లాంటి ప్రమాదకర విషజ్వరాలు వ్యాపించి ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలో పడకలుచాలని పరిస్థితి అని తెలిపారు. అనేక సార్లు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, సీపీఐ పార్టీ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా తెలిపిన డోంట్ కేర్ అన్నట్లు వ్యవహరిస్తున్నారని ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదని శ్రీధర్ తెలిపారు. మున్సిపల్ అధికారులు పన్నులు మాత్రం కరకండిగా ఆటో ఎనౌన్స్ ద్వారా వాలంటీర్ల ద్వారా పదే పదే హెచ్చరిస్తూ ముక్కు పిండి వసూళ్లు చేస్తున్నారన్నారు. పన్నులు వసూలు చేస్తున్నప్పుడు ప్రజా అవసరాలు గుర్తుచేసారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు ముత్తిరెడ్డి శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ యువ నాయకుడు మామిడి బత్తుల గని తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం..

జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల

విశాలాంధ్ర - చీరాల : దేశ స్వాతంత్ర్యానికి ముందు ఏర్పడి కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం జరుపుతున్న ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిద్దామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. ఆదివారం చీరాల ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో అక్టోబర్ 31తేదీన ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల గురించి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ ఏఐటీయూసీ ఆవిర్భవించి 104 సంవత్సరాలు కావస్తుందని, కార్మికులు కర్షకులు అందరూ కలిసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రస్తుత బీజేపీ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థలు ఏమి నెలకొల్పాపోగా ఉన్న సంస్థలను అమ్మేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ డ్రైవర్లకు రక్షణ కరువైందని కార్మికులందరు కలసి కట్టుగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలంటే కార్మిక వర్గం చైతన్యమై ఐక్య ఉద్యమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బాసి పైడయ్యా, అచ్యుతుని బాబురావు, చీరాల నియోజకవర్గ కార్యదర్శి చిరుమల ప్రకాష్, షేక్ ముంతాజ్, జొన్నదుల భారతి, రామేశ్వరం కుమార్, కె.వి రావు, మచ్చ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు బాపట్లలో విజయపదం యాత్ర బహిరంగ సభ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 25 అడుగుల విగ్రహం వద్ద సోమవారం సాయంత్రం 5 గంటలకు విజయపదం యాత్ర బహిరంగ సభ జరుగుతుందని అంటరానితన నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జి.చార్వాక తెలిపారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చార్వాక మట్లాడుతూ విజయపదం యాత్ర ముఖ్య ఉద్దేశం పేదరిక నిర్మూలన చేయబడ్డ వర్గాలకు రాజ్యాంగపరంగా రావాల్సిన హక్కులు ఎందుకు వీరికి అందడం లేదని అధికారంలో ఉన్నటువంటి వారు పేదవారిని నిర్లక్ష్యం చేస్తున్నారని మాజీ ఐఏఎస్ అధికారి విజయకుమార్ యాత్ర ప్రారంభించారన్నారు. యాత్ర నెల్లూరు జిల్లా తడలో ప్రారంభించి 70 రోజులు పాదయాత్ర చేసుకుంటూ బాపట్ల పట్టణంలో ప్రవేశించి కొత్త బస్టాండ్ వద్ద నుండి ర్యాలీగా జమ్ములపాలెం ఫ్లైఓవర్ దగ్గరకు వస్తారన్నారు.అక్కడ జరిగే బహిరంగ సభలో మాజీ ఐఏఎస్ ఆఫీసర్ విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని చార్వాక తెలిపారు.ఈ బహిరంగ సభకు ఎస్సీ,ఎస్టీ బీసీ మైనార్టీ క్రైస్తవ నాయకులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లెల వెంకటరావు,మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజాన్ బాబు, ఏ.ఎన్.పి.ఎస్ జిల్లా అధ్యక్షులు గొర్రెముచ్చు వందనం,దళిత మహిళ నాయకురాలు దాసరి లక్ష్మి, రేపల్లె నియోజకవర్గం నాయకులు చల్లపల్లి కోటేశ్వరరావు, వేమూరు నియోజకవర్గ అధ్యక్షులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఫిట్ ఇండియా రన్ 4.0

విశాలాంధ్ర - చెరుకుపల్లి : ప్రస్తుతం ఉన్న ఉరుకుల పరుగుల ప్రపంచంలో మనుషులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని శరీరానికి తగ్గ వ్యాయామం చేయాలని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ పయనం ఏడుకొండలరెడ్డి అన్నారు.ఆదివారం తమ పాఠశాల ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో విద్యార్థులకు 5కె,3కె,2కె రన్ కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తమ పాఠశాలతో పాటు వివిధ పాఠశాలలకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.తొలుత చిన్నారులకు 2కే రన్ జెండా ఊపి ప్రారంభించారు.పోటీల్లో పాల్గొన్న చిన్నారుల అందరికీ తగు జాగ్రత్తలు తీసుకుంటూ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి నిపుణులైన వైద్యులను అందుబాటులో ఉంచి ఫస్ట్ ఎయిడ్ మెటీరియల్ ఏర్పాటు చేశారు. ఎంతో నైపుణ్యం గల శిక్షకులను చిన్నారుల వెంట ఉంచి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. గ్రామీణ ప్రాంతంలో ప్రపంచ స్థాయి నైపుణ్యం గల పాఠశాలను ఏర్పాటు చేసి దాన్ని సమర్థవంతంగా నడపటం ఎంతో అభినందనీయమని విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు. ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో తమ ప్రాంతంలో ఉన్న విద్యార్థులు కూడా అత్యున్నత ప్రమాణాలను అందిపుచ్చుకోవటం ఎంతో అదృష్టం అన్నారు. విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ సాయి రంగారెడ్డి, సీఈవో గణేష్ రెడ్డి,ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసాద్ రెడ్డి, ప్రిన్సిపాల్ నర్గీస్ క్వాజి,ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు,విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉర్లమ్మతల్లికి సుబ్రమణ్యం భారీ మొక్కుబడి

పెద్ద ఎత్తున హాజరైన భక్తజనం

పాల్గొన్న ఎమ్మెల్యే కోన, టీడీపీ ఇంచార్జ్ వేగేశన, పలువురు ప్రముఖులు

విశాలాంధ్ర - కర్లపాలెం : మండలంలోని నల్లమోతువారి పాలెం గ్రామ సర్పంచ్ మాదా సుబ్రహ్మణ్యం ఆదివారం గణపవరం పంచాయతీ చినపులుగువారిపాలెంలో వేంచేసియున్న ఉర్లమ్మ అమ్మవారికి కుటుంబ సభ్యులతో కలిసి మొక్కుబడులు చెల్లించుకున్నారు.మాదా సుబ్రహ్మణ్యం ఉర్లమ్మ అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకునే కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూల నుంచి పార్టీలకు సుమారు 7 వేలమందికి పైగా పాల్గొనగా వారికి అన్న దానం చేశారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మొక్కుబడి వేడుకలలో పాల్గొని ఉర్లమ్మ అమ్మవారికి నారికేళఫలాలు సమర్పించారు. తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వేగేశన నరేంద్రవర్మ, బాపట్ల మాజీ ఎంపిపి మానం విజేత, బాపట్ల నియోజకవర్గ తె.దే.పానేతలు, నియోజకవర్గంలోని పలు వైఎస్సార్ పార్టీనాయకులు, జనసేన పార్టీ నాయకులు మొక్కుబడి వేడుకలలో పాల్గొన్నారు. మాదా సుబ్రహ్మణ్యం అమ్మవారికి ఉర్లమ్మ అమ్మవారికి మొక్కుబడులు చెల్లిస్తున్న సమయంలో వర్షం ప్రారంభం కావటంతో అక్కడికి విచ్చేసిన ప్రజలు, రైతులు ఆనందం వ్యక్త చేశారు. నియోజకవర్గంలోని రైతాంగాన్ని, వరిపంటలను అమ్మవారి చల్లగా చూడాలని, వర్షం కురిపించి పైర్లను కాపాడాలని ఉర్లమ్మతల్లిని వేడుకుంటున్నామని మాదా సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదా శ్రీనివాసరావు దంపతులు, మాజీ ఎంపిపి మాదా వెంకటరత్నం, కర్లపాలెం ఎంపిపి యారం వనజ, మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ,ఏపూరి భూపతిరావు, నక్కల వెంకటస్వామి, షేక్ బాజీ, నక్కల శేషాద్రి, ధనాలకోట ప్రసాద్, కుర్రా ధనేంద్ర, టీడీపీ, వైసీపీ నాయకులు, నియోజకవర్గంలోని పలుపార్టీల నాయకులు, పలుగ్రామాలసర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - చీరాల : ఇటీవల కాలంలో ఆర్టీసీ డ్రైవర్లపై దాడులు పెరిగిపోయాయని,ప్రజలు ఏదైనా కంప్లైంట్ ఇస్తే తక్షణమే విచారణ చేసే ఆర్టీసీ యాజమాన్యం డ్రైవర్లపై దాడులు జరిగినప్పుడు స్పందించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు.చీరాల ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కావలిలో డ్రైవర్‌పై దాడిని ఖండిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.వీరావు,చీరాల డిపో కార్యదర్శి ఎం.ఎస్ రావులు మాట్లాడుతూ విజయవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ రామ్‌సింగ్‌పై కావలి పట్టణంలో రౌడీ మూకలు విచక్షణారహితంగా దాడి చేయడం దుర్మార్గమన్నారు.బెంగళూరు నుంచి విజయవాడకు వస్తున్న సమయంలో కావలి పట్టణంలో రోడ్డుపై బైకు ఉండగా డ్రైవర్ హారను కొట్టడం జరిగిందని,బైకుపై ఉన్న వ్యక్తులతో కలసి మరికొంత మంది కారులో రౌడీ మూకలు బస్సును వెంబడించి డ్రైవర్‌ను కండక్టర్‌ను విచక్షణ సహితంగా కొట్టడం జరిగిందన్నారు. విధుల్లో ఉన్న డ్రైవర్ పై భౌతిక దాడికి పాల్పడిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు ఆర్టీసీ యాజమాన్యం కూడా డ్రైవర్, కండక్టర్ల భద్రతకు ప్రత్యేక రక్షణ కల్పించాలన్నారు.ఇటువంటి దాడులను పునరావత్వం కాకుండా ఆర్టీసీ యాజమాన్యం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడుఅచ్యుతుని బాబురావు,ఆర్టీసీయూనియన్ నాయకులు వెంకట్రావు,శ్రీనివాసరావు, శేఖర్,సలీం,స్టాలిన్,సుజాత,రామేశ్వరం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి కొరతతో కృష్ణా డెల్టా ఆయకట్టు ప్రాంతం

ఇది రాష్ట్ర ప్రభుత్వ తప్పిదమే

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యం కారణంగా కృష్ణా డెల్టా ప్రాంతం ఎండిపోతుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో నీరు అందక ఎండిన పంట పొలాలను సీపీఐ బృందం ఆదివారం పరిశీ లించింది. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసు కుంది. ఈ సందర్భంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లా డుతూ తూర్పు డెల్టా... పశ్చిమ డెల్టాకు ఇటువంటి పరిస్థితి రావడం గత 40 సంవత్సరాలలో ఎన్నడూ చూడ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులలో నీటి నిల్వలు ఉన్నప్పుడు వాటిని ఎట్లా నిల్వ చేసుకోవాలి, వర్షాభావ పరిస్థితి వస్తే వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలి... పంటలను ఎలా కాపాడుకోవాలనే ఆలోచన రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఇరిగేషన్ మంత్రికి లేకపోవడం శోచనీయమని అన్నారు. అదే నేడు రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రలలో నీటి ఎద్దడికి కారణమని స్పష్టం చేశారు. 8200 క్యూసెక్కులు డిజైన్ డిశ్చార్జి బకింగ్‌హోమ్ కాలువకుంటే 4500, 4600 నీళ్లు ఇవ్వండి అంటే ఏఈ, డీఈలు ఉరి వేసుకునే పరిస్థితి వచ్చిందని అన్నారు. రైతులకు సమాధానం చెప్పలేక ఇళ్లల్లో తలుపులేసుకుని కూర్చుంటున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితిలో తాము ఏమి చేయాలని ప్రశ్నించారు. ఏఈ లేక డీఈ లేక ఇరిగేషన్ మంత్రి లేక ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడి చేయాలా అని నిలదీశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యేలు, మంత్రులు పొలాల బాట పట్టి అక్కడి పరిస్థితి తెలుసుకుని రైతులకు ఓదార్పునివ్వాలని అన్నారు. లక్షల కోట్లు ఉదారంగా ఖర్చు చేస్తున్న ప్రజాప్రతినిధులు పంటను కాపాడటానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ముప్పాళ్ల డిమాండ్ చేశారు. అలాగే రేవేంద్రపాడు వద్ద ఉన్న కూలిపోయే వంతెనను తక్షణమే ఆధునీకరించాలన్నారు. ప్రమాదాలు చోటుచేసుకుంటే తప్పా స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించారా అంటూ ప్రశ్నించారు. పది సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఉన్న మీకు వంతెన పరిస్థితి కనబడటం లేదా అని నిలదీశారు. వంతెనను బాగు చేయాలని కోరుతూ కమ్యూనిస్టు పార్టీ 12 సంవత్సరాల క్రితం సంతకాలతో కూడిన ఉత్తరాలను ప్రభుత్వానికి, ఇంజనీర్లు, కలెక్టర్లకు పంపించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. వంతెన కూలిపోయే వరకు ఎదురుచూడకుండా లాకులతో కూడిన ఆధునిక వంతెన నిర్మించి హై లెవల్ ఛానల్‌కు నీరు వచ్చేట్టు ఒక శాశ్వత పరిష్కారాన్ని చూపాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ పెదవడ్లపూడి ప్రాంతంలో కౌలుతో పాటు పెట్టుబడే సుమారు రూ.30 వేలు అయిందని, నీరు లేక ఇక్కడి భూములు బీడు వారి రైతు నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వ అధికారులు పట్టిపట్టనట్టుగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. తక్షణమే ఈ ప్రాంతానికి నీరు వదలకపోతే నష్టపోయిన రైతాంగం ఆత్మహత్యలు చేసుకునే దిశగా అడుగులు వేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంట పొలాల పరిశీలనలో కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ముసునూరు సుహాస్, కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, జవ్వాది సాంబశివరావు, చిట్టిబొమ్మ శ్రీనివాసరావు, పొన్నెకంటి రాధాకృష్ణ, ప్రసాద్, శ్రీరాములు, గోహార్ జానీ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

ప్రజాదరణ ఓర్వలేక చంద్రబాబు అక్రమ అరెస్టు

విశాలాంధ్ర-అద్దంకి; మాజీ ముఖ్యమంత్రి చంద్ర బాబుకు వస్తున్న ప్రజాద రణ ఓర్వలేక అక్రమంగా అరెస్టు చేశారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ధ్వజమెత్తారు. ఆదివారం మండలంలోని ధర్మవరం గ్రామం నుండి బొమ్మనంపాడు గ్రామం వరకు చంద్రబాబు అక్రమ అరెస్టును తెలియజేస్తూ రవికుమార్ సైకిల్ యాత్ర చేశారు. దారిపొడవునా ఆయా గ్రామాలలో సైకిల్ యాత్ర చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్‌కు మహిళలు హారతులు ఇచ్చి పూలతో స్వాగతం పలికారు. ధర్మవరం గ్రామంలో శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం శంఖవరప్పాడు గ్రామంలో డా,బిఆర్,అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొమ్మనంపాడు గ్రామంలో అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద చంద్రబాబు త్వరగా విడుదల కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సైకిల్ యాత్ర ద్వారా గ్రామాలలో చంద్రబాబు అక్రమ అరెస్టు గురించి ప్రజలను చైతన్యపరుస్తూ వైకాపా ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ.. తెదేపా అధికారంలోకి వస్తే భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తూ ప్రజల సమస్యలను వింటూ 10 కిలోమీటర్లు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సైకిల్ యాత్ర చేశారు. మండలం నుంచి పెద్ద ఎత్తున తెదేపా శ్రేణులు పాల్గొన్నారు.

ఓటరు చైతన్యంపై రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర - చీరాల : ప్రస్తుతం ఎన్నికల సమిపిస్తున్న తరుణంలో ప్రజలం దరూ ఓటుపై చైతన్య కలిగి ఉండాలని, కుల,మత, ధనాపేక్షలకు ఓటును తాకట్టు పెట్టె విధానానికి ప్రజలు దూరంగా ఉండాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం చీరాల సీనియర్ సిటిజన్ కార్యాలయంలో జనవిజ్ఞాన వేదిక, సీనియర్ సిటిజన్స్ సంఘం,అభ్యుదయ బావాల వేదిక ఆధ్వర్యంలో ఊరూరా జన విజ్ఞానం ప్రజాస్వామ్యం, ఎన్నికలు, ఓటరు చైతన్య, ఎన్నికల సంస్కరణలు, దామాషా ప్రకారం ఎన్నికలు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోట వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు అనేది ప్రతి పౌరునికి వజ్రాయుధం వంటిదని, ప్రధానంగా ప్రజలలో ఓటుపై చైతన్యం తీసుకొచ్చేందుకే కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ సంఘం అధ్యక్షులు గాదె హరిహరరావు, సీనియర్ సిటిజన్ సంఘం కార్యదర్శి రామారావు, మానవత అధ్యక్షులు నాగ వీర భద్రాచారి, అభ్యుదయ భావాల వేదిక ప్రతినిధి కూరపాటి నారాయణ, శీలం రవికుమార్, మునీర్ ఖాన్, కోటేశ్వరరావు, సత్యనారాయణ, సుభాని తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి వాటర్ మోటర్ బహుకరణ

విశాలాంధ్ర - చీరాల : ఎంతోమంది పేదలకు వైద్య సేవలు అందిస్తున్న చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి వాటర్ మోటర్ సెట్‌ని కరణం వెంకటేష్ జన్మదిన సందర్భంగా అందించడం ఎంతో ఆనందంగా ఉందని,కామాక్షి కేర్ హాస్పిటల్ ఎం.డి తాడివలస దేవరాజు అన్నారు.చీరాల వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ కరణం వెంకటేష్ జన్మదినం సందర్భంగా కామాక్షి కేర్ హాస్పిటల్,రోటరీ క్లబ్ క్షీరపురి తరఫున చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి 20వేల రూపాయలు విలువ చేసే వాటర్ మోటర్ సెట్‌ని అందించారు.ఈ కార్యక్రమంలో దేవరాజు మాట్లాడుతూ చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి అధ్వర్యంలో చీరాల ప్రభుత్వ వైద్యశాలను ఎంతో అభివృద్ధి చేస్తూ చేస్తున్నారని,ప్రభుత్వంతో పాటు దాతలు కూడా చీరాల ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకొని హాస్పిటల్ అభివృద్ధికి చేయూతను అందించాలన్నారు.రోటరి క్లబ్ ఆఫ్ క్షీరపురి, కామాక్షి కేర్ హాస్పిటల్ పేద ప్రజలకు సేవ చేయడానికి ఎప్పుడు ముందు ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో హాస్పటల్ సూపర్నెంట్ డాక్టర్ సుహాసిని, మాస్టర్ రావి వెంకటరమణా, గవర్నమెంటు హాస్పటల్ సిబ్బంది సుందరమ్మ, విజయనిర్మల,పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని యద్దనపూడి, గన్నవరం, అనంతవరం, యనమదల, చింతపల్లిపాడు, వింజనంపాడు, సురవరపుపల్లి, పోలూరు తదితర గ్రామాలలో టిడిపి నాయకులు ఓటర్లు జాబితాను పరిశీలిస్తున్నారు. గత కొద్ది రోజులుగా వైసీపీ ప్రభుత్వం అక్రమంగా ఆన్లైన్లో టిడిపి సానుభూతి పరుల ఓట్లను అక్రమంగా తొలగించేందుకు ఫారం 7 ఉపయోగించటంతో, టిడిపి నాయకులు ఫారం 7 పెట్టిన ఓట్లకు, ఓటర్ల సంబంధించిన పత్రాలు, ఆధారాలు అధికారులకు అందజేశారు. అధికారులు జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు, గ్రామాలలో ఫారం 7 పెట్టిన ఓటర్ల ఇంటికి వెళ్లి విచారణ చేశారు. అనంతరం కలెక్టర్ ఉత్తర్వులు ప్రకారం కొంతమంది అధికారులను సస్పెండ్ చేయడం జరిగింది. ఈనెల 27న అధికారులు కొత్త ఓటర్ల జాబితాను విడుదల చేయడంతో ప్రతి గ్రామంలో నాయకులు వారి సానుభూతిపరుల ఓట్లను జాబితాలో పరిశీలించుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నల్లపనేని రంగయ్య చౌదరి, కనపర్తి నాగేశ్వరరావు, రాయపాటి సీతయ్య,గుదే తారక రామారావు, కొరటాల వంశీకృష్ణ కోయ సతీష్,వజ్జా సుబ్బరామయ్య ఈరపనేని వాసు, సూరిశెట్టి శ్రీనివాసరావు ,షేక్ బాజీ, రాయుడు,నిమ్మల సాంబశివరావు, పెరవల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు కనువిప్పు కలగాలి: వేగేశన

విశాలాంధ్ర - బాపట్ల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి కనువిప్పు కలగాలని టీడీపీ ఇంచార్జ్ వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం రాత్రి 7 గంటల నుంచి ఐదు నిమిషాల పాటు పార్టీ నాయకులతో వేగేశన కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వేగేవన మాట్లాడుతూ నిజం గెలవాలి చంద్రబాబుకు వేసిన సంకెళ్లు బద్దలు కావాలంటే జగనాసురునికి కనువిప్పు కావాలని కోరారు. అన్యాయంగా అక్రమంగా ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపి పైచాచిక ఆనందం పొందుతున్నారన్నారు. ఎప్పటికైన నిజం గెలుస్తుందని తెలిపారు. చంద్రబాబును అన్యాయంగా బాధపెట్టిన వారు తప్పక అనుభవిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.